విధులకు సకాలంలో హాజరు కావాలి

మానకొండూర్ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 7: వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్య లుంటాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం మానకొండూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు అన్నారం సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, హాస్పిటల్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉంచాలని, బీపీ, షుగర్ పేషెంట్లకు నెలకు సరిపడేలా మందులు ఇవ్వాలని ఆదేశించారు. వివిధ అంశాలపై డాక్టర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ డీపీవో స్వామి, డాక్టర్ సల్మాన్, డాక్టర్ మానస, సూపర్‌వైజర్ సరోజ, స్టాఫ్‌నర్స్ షహనాజ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌కు పునాది వేసుకోవాలి

జమ్మికుంట, ఫిబ్రవరి7: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ అవిర్నేని సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. కాకతీయ జూనియర్ కాలేజీ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రథమ సంవత్సర విద్యార్థులు స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ రవిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా చైర్మన్ హాజరై మాట్లాడుతూ.. ఉన్నత చదువుల తర్వాత ఆయా రంగాల్లో స్థిరపడాలని సూచించారు. అనంతరం ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఇక్కడ శ్రీనివాస్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులున్నారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

రమాబాయికి నివాళులర్పిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తదితరులు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి వేడుకలు శుక్రవారం హుజూరాబాద్ అంబేద్కర్ జయంత్యోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, అంబేద్కర్ జయంతి కమిటీ చైర్మన్ ఖాలిక్ హుస్సేన్, పూలే జయంతి కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్

కొత్తపల్లి, ఫిబ్రవరి 7: ఇటీవల తమిళనాడులో జరిగిన జాతీయస్థాయి డైమండ్ జూబ్లీ జంబూరి క్యాంపులో పాల్గొన్న పారమిత పాఠశాలకు చెందిన ఐదుగురు స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతిభ చూపి మెరిట్ సర్టిఫికెట్లు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు టి. సాయివైష్ణవి, కె. శ్రేష్ట, 8వ తరగతి విద్యార్థినులు టి. వైష్ణవి, ఎస్. వర్షిత్, ఎస్ ధనుష్ మార్చ్‌ఫాస్ట్, జానపద నృత్యాలు, క్యాంప్ క్రాఫ్ట్, రంగవల్లి, శారీరక సామర్థ్య పరీక్షల్లో పాల్గొని ప్రతిభ చాటారన్నారు. విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, వినోదరావు, హనుమంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

రాంనగర్, ఫిబ్రవరి 7: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. శుక్రవారం చొప్పదండి మండలం రుక్మాపూర్ కేజీబీవీలో మత్తు పదార్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారమయం అవుతుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తు కాపాడుకోవాలని సూచించారు. కలెక్టర్ సూచన మేరకు పాఠశాలలో కాన్షియస్‌నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాలరక్షక్ కో ఆర్డినేటర్ సాయి కిరణ్, నషా ముక్త్ భారత్ మాలతి, స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఫిబ్రవరి 7: సబ్ స్టేషన్లలో మెయింటనెన్స్, ఏబీ స్విచ్‌ల పనులు చేపడుతున్నందున శనివారం కరీంనగర్‌లోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కరీంనగర్ టౌన్-1, 2, కరీంనగర్ రూరల్ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

* ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు కిసాన్ నగర్, అంబేద్కర్ నగర్, శివాజీ నగర్, ఆదర్శ నగర్, ఖాన్ పుర, హుస్సేనీపుర, సుభాష్ నగర్, బుట్టిరాజారాం కాలనీ, తీగలగుట్టపల్లె, సరస్వతీ నగర్, విద్యారణ్యపురి,

* మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు సంతోష్ నగర్, శ్రీహరి నగర్, కూర్మవాడ, గణేశ్ నగర్, పీటీసీ, పాల డెయిరీ, బుల్ స్టేషన్, కాంగ్రెస్ భవన్ ప్రాంతాలు

* ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంబేద్కర్ స్టేడియం ఏరియా, ఎల్‌ఐసీ ఆఫీసు, కట్టరాంపూర్, భగత్ నగర్, హరిహర నగర్, న్యూ శ్రీనగర్ కాలనీ, గౌతమీ నగర్

* ఉదయం10నుంచి 11.30గంటల వరకు బ్యాంక్ కాలనీ, తులసీ నగర్

* ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తీగలగుట్టపల్లె, సరస్వతీ నగర్, విద్యారణ్యపురి, మానికేశ్వరీ నగర్, నగునూరు, కొత్తపల్లి, ముగ్దుంపూర్, ఇరుకుల్ల, బొమ్మకల్ ప్రాంతాలు

* మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు చర్లబూత్కూర్, చామనపల్లి, దుబ్బపల్లి, తాహెర్ కొండాపూర్, జూబ్లీ నగర్, ఫకీర్ పేట్, బహదూర్ ఖాన్ పేట్

* ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కట్ట రాంపూర్, వినాయక నగర్, గిద్దెపెరుమాండ్ల ఏరియా, గౌతమీ నగర్, హనుమాన్ నగర్, ప్రొఫెసర్ నగర్, తిరుమల నగర్, అలకాపురి కాలనీ, కోతి రాంపూర్, మెయిన్ రోడ్, ఉజ్వల పార్క్ ఏరియా, హనుమాన్ నగర్, గణేశ్ నగర్ బైపాస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పట్టణం సహ బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఎం శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

APROOVA FLORETS INTERNATIONAL SCHOOL
WANTED
We are Hiring :- Educator's needs
★ Pre Primary Mother Teacher
★ Primary Teachers (All Subjects)
★ Front office Excutive ★ Computer Operator
★ Arts & Craft
Walk in on : 09-Feb-2025
@10:00 AM Call us On: 9849364030
Note: The aspirants Should be Qualified and Should be Skilled with Sound Communication.

నామినేషన్ల జోరు

ఐదురోజుల్లో 58 దాఖలు • పట్టభద్రుల స్థానానికి 49 • ఉపాధ్యాయ స్థానానికి 9

మహిళా ఉద్యోగిని విచారిస్తున్న పోలీసులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 7: ఉత్తర తెలంగాణ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి స్థానాలకు నామినేషన్ల జోరు పెరిగింది. శుక్రవారం రెండు స్థానాలకు 30 నామినేషన్లు రాగా, వీటిలో పట్టభద్రుల స్థానానికి 28, ఉపాధ్యాయ స్థానానికి 2 సెట్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు 58 నామినేషన్లు దాఖలు కాగా, పట్టభద్రుల స్థానానికి 49, ఉపాధ్యాయ స్థానానికి 9 వచ్చినట్లు రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి తెలిపారు. నామినేషన్ల పర్వానికి గడువు సమీపిస్తుండడంతో పలు పార్టీలు బలపరుస్తున్న అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా రిటర్నింగ్ కార్యాలయానికి బారులు తీరారు. ఉమ్మడి నాలుగు జిల్లాల నుంచే కాకుండా దక్షిణ తెలంగాణ జిల్లా నుంచి కూడా పలువురు అభ్యర్థులు తమ మద్దతుదారులతో తరలివచ్చి, పట్టభద్రుల స్థానానికి నామినేషన్లు వేశారు. నామినేషన్ వేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న వి.నరేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి చిన్నమైల్ అంజిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా రిజైన్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, రిజైన్డ్ డీఎస్పీ మదనం గంగాధర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ కాంగ్రెస్ నేత, విద్యార్థి రాజకీయ పార్టీ అభ్యర్థి బక్క జడ్సన్ ఉన్నారు. వీరితో పాటు మరో 22 మంది స్వతంత్రులుగానే రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి నామినేషన్లు అందజేశారు. ఉపాధ్యాయ స్థానం నుంచి పీఆర్‌టీయూ బలపరుస్తున్న అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డితో పాటు మరొకరు దాఖలు చేశారు. శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు దినాలు కావడం, చివరి రోజైన సోమవారం ఇంతకు రెట్టింపు నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంటున్నది.

పోలీసుల అత్యుత్సాహం.. ఉద్యోగులు, సామాన్యుల ఇబ్బంది

శాసనమండలి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు బృందాలు ప్రదర్శిస్తున్న అత్యుత్సాహంతో, సామాన్యులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌లోకి వచ్చే సామాన్యులతో పాటు కలెక్టరేట్ ఉద్యోగులను కూడా వదలకుండా తనిఖీల పేర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. తాము పలు పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తుండగా, పదే పదే గుర్తింపు కార్డులడుగుతూ, తమ పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. గుర్తింపుకార్డులు చూపినా తమ ద్విచక్ర వాహనాలు సైతం తనిఖీలు చేయాలంటూ, లేదంటే రోడ్డుపై పార్కింగ్ చేయాలని ఆంక్షలు విధిస్తూ తమను ఇక్కట్ల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి నామినేషన్ వేసే అభ్యర్థులతో వారి అనుచరులు నిర్దేశించిన మేరకు మాత్రమే లోనికి పంపేందుకు మాత్రమే పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. అయితే, కలెక్టరేట్‌లోని బ్యాంకుకు వెళ్లే ఖాతాదారులు, పలు ప్రభుత్వ శాఖల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చే సాధారణ ప్రజలు, కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులను కూడా పోలీసులు తనిఖీలు చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. దీంతో, ఉద్యోగులు సైతం పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఘటనలు రెండు రోజులుగా కనిపించాయి.

భార్య మృతిని తట్టుకోలేక ఆత్మహత్య

జమ్మికుంట, ఫిబ్రవరి 7: భార్య మృతిని తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మడిపల్లిలో జరిగింది. పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన రాజేందర్(53)భార్య అనారోగ్యంతో మూడు నెలల క్రితం మృతి చెందింది. భార్య మృతితో మనస్తాపానికి గురైన రాజేందర్, శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కొడుకు శరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఆగి ఉన్న ట్రాక్టర్ ఢీకొని ఒకరి దుర్మరణం

జమ్మికుంట, ఫిబ్రవరి 7: ద్విచక్ర వాహనంపై వస్తూ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి(35) మృతి చెందాడు. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గోదాముల్లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఉదయం విధులకు వెళ్లిన భాస్కర్, సాయంత్రం సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో కోరపల్లి శివారులో ఆగిఉన్న ట్రాక్టర్‌ను భాస్కర్ వాహనం ఢీకొన్నది. తీవ్ర గాయాలైన భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య వర్షిణి, ఇద్దరు పిల్లలున్నారు. కాగా, మృతుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

టీబీ ఫ్రీ గ్రామపంచాయతీపై శిక్షణ

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: టీబీ ముక్త్ గ్రామపంచాయతీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా డీటీసీవో రవీందర్ రెడ్డి, హుజూరాబాద్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో చందు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మధుకర్, ఎంపీడీవో సునీత, హెచ్‌ఈవో పంజాల ప్రతాప్, ఎస్‌టీఎస్ శ్రీనివాస్ రెడ్డి, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ డిస్ట్రిక్ట్ లీడ్ ప్రభాకర్ హాజరయ్యారు. హుజూరాబాద్, సైదాపూర్‌లోని అన్ని గ్రామాలను టీబీ ఫ్రీ గ్రామాలుగా మార్చడానికి అందరి సహాయ సహకారాలు అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌టీఈపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట, ఫిబ్రవరి 7: ప్రతి ఒక్కరూ టీబీపై అవగాహన కలిగి ఉండాలని, టీబీలేని సమాజాన్ని నిర్మించడంలో అందరూ భాగస్వాములుకావాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ప్రతినిధి ప్రభాకర్ పిలుపునిచ్చారు. టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు 'టీబీ ఫ్రీ గ్రామ పంచాయతీ'పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లోనూ టీబీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇక్కడ ట్రైనింగ్ మేనేజర్ సురేందర్, హెచ్ఈ మోహన్‌రెడ్డి, ఎస్‌టీఎస్ దేవేందర్‌రెడ్డి, ఎస్‌టీఎల్‌ఎస్ కిరణ్, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ తిరుపతి, కార్యదర్శులున్నారు.

అల్పాహారానికి విరాళం

గంగాధర, ఫిబ్రవరి 7 : గంగాధర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్పాహారం కోసం హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ ఫౌండేషన్ సభ్యులు రూ.6,500 విలువైన సామగ్రిని శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయకు అందజేశారు. సామగ్రి అందజేసిన ఫౌండేషన్ సభ్యులకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 7: చెర్లభూత్కూర్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను దహనం చేశారు. రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలకు గానూ తీన్మార్ మల్లన్న వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెర్లభూత్కూర్ రెడ్డి సంఘం అధ్యక్షుడు నల్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, కూర శ్యాంసుందర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

రాంనగర్, ఫిబ్రవరి 7: కొత్తపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ రైతు మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన రైతు జంగిలి అంజయ్య (65) గురువారం సాయంత్రం కొత్తపల్లి మార్కెట్‌కు వచ్చి కూరగాయలు, ఇంటికి సరుకులు కొనుగోలు చేసి తిరిగి తన సైకిల్‌పై గ్రామానికి వెళ్తుండగా, అతివేగంగా ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో అంజయ్య తల, శరీరభాగాలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

జమ్మికుంట, ఫిబ్రవరి7: ఆస్తుల పంపకాల విషయంలో గడ్డి మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి రమేశ్‌కు తన కుటుంబ సభ్యులకు 42 సంవత్సరాల నుంచి ఉమ్మడి ఆస్తుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. పంపకాలు కావడం లేదు. తరచూ జరుగుతున్న గొడవలకు మనస్తాపానికి గురైన రమేశ్ గురువారం గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సృజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని మహాత్మా నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 25 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ సీడీపీవో శ్రీమతి పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇస్రాత్ సుల్తానా, మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలి

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 7: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్లాలని సైకాలజిస్ట్ ఎజ్రా మల్లేశం విద్యార్థులకు సూచించారు. శుక్రవారం దేవంపల్లి గురుకుల పాఠశాల/కళాశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో మానసిక ఒత్తిడికి లోను కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో, గురుకుల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, వైస్ ప్రిన్సిపాల్ కొమురయ్య, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవ రత్నా అవార్డు గ్రహీత మొగురం రమేశ్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రేణికుంట బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కల్యాణోత్సవంలో నృత్యం చేస్తున్న ధర్మకర్త శ్రీనివాస్ దంపతులు

పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

కనుల పండువగా కల్యాణోత్సవం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7: జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆలయ ఈవో సుధాకర్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్ శ్రీదేవీ, భూదేవీ, లక్ష్మీ అమ్మవార్ల తరపున కన్యాదాతలుగా వ్యవహరించారు. తిరుమల నుంచి తెప్పించిన 15 వేల లడ్డూలను భక్తులందరికీ వితరణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గోగుల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కచేరీలు, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పేద విద్యార్థినులకు చేయూత

గంగాధర, ఫిబ్రవరి 7: నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థినులకు ఫీజు చెల్లించి చేయూతనందించారు యూత్ కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు వొడ్నాల యజ్ఞేశ్. మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన శరణ్య, మధురానగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పత్తికుంటపల్లికి చెందిన కీర్తన అనే విద్యార్థినులు స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో విద్యార్థినులకు ఫీజు చెల్లించలేని పరిస్థితులు నెలకొనగా, తల్లిదండ్రులు యూత్ కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు వొడ్నాల యజ్ఞేశ్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి శుక్రవారం పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి ఇద్దరు విద్యార్థినులకు సంబంధించిన ఫీజు రూ.44 వేలు చెల్లించారు. పేద విద్యార్థుల ఫీజు చెల్లించిన యజ్ఞేశ్‌ను స్థానికులు అభినందించారు.

ఎస్సారార్‌లో ఇన్‌కమ్ ట్యాక్స్‌పై వర్క్‌షాప్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7 : శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో 'ఐటీ ఫైలింగ్ ఓల్డ్ రిజీమ్, న్యూ రిజీమ్'పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టర్డ్ అకౌంటెంట్ సయ్యద్ నదీమ్ హుస్సేన్ ప్రధాన వక్తగా హాజరై విద్యార్థులకు పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ, అందరూ ఐటీ ఫైలింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేతకాని కుల జనాభా తక్కువ చూపించారు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 7: రాష్ట్ర వ్యాప్తంగా నేతకాని కులస్తుల జనాభాను కులగణన సర్వేలో తక్కువ చూపించారని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం మారుతి ఆరోపించారు. నగరంలోని ప్రెస్ భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నేతకాని కులస్తులు 15లక్షల మంది ఉంటారని, కానీ సర్వేలో తక్కువ చూపించారని పేర్కొన్నారు. అత్యంత వెనుకబడిన నేతకాని కులాన్ని గ్రూప్ 1లో చేర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు ముందు మాల మాదిగ, నేతకాని రాష్ట్ర నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మోహన్, కొమురయ్య, చంద్రయ్య, శివయ్య పాల్గొన్నారు.

ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

ముకరంపుర, ఫిబ్రవరి 7: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ స్టేట్ కార్యదర్శి సదానందం కోరారు. సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. దశల వారీగా అనేక కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం స్పందించనందున ఈ నెల 20న విద్యుత్ సౌధ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ కరీంనగర్ జిల్లా చైర్మన్ శివకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ వజీర్, నాయకులు సదానందం, చంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కోటి సలీం పాషా, రవీందర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్, కన్వీనర్లు, కార్మికులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ దంపతులకు ఆత్మీయ సన్మానం

మాజీ కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య దంపతులను సన్మానిస్తున్న వార్డు ప్రజలు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని 26వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య-నర్సింహారెడ్డి దంపతులను వార్డు ప్రజలు, అభిమానులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ, ప్రజల సహకారంతోనే వార్డు అభివృద్ధి సాధ్యమైందన్నారు. అలాగే, భవిష్యత్‌లోనూ సహకరించాలని ప్రజలను కోరారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎస్సారార్ విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7 : శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ఉదయ్, పూజ ఈ నెల 11 నుంచి బెంగళూర్‌లో జరుగబోయే జాతీయ సమైక్యత శిబిరానికి శాతవాహన యూనివర్సిటీ పక్షాన ఎంపికవ్వగా, వారిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ అభినందించారు. ఇక్కడ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. నితిన్, టి రాజయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ హర్ జ్యోత్ కౌర్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె. అర్జున్, డాక్టర్ వి. రాజేశం, బి. ఎలిజబెత్ రాణి, డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ రాపర్తి శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వరరావు, సుధాకర్, రామకృష్ణ ఉన్నారు.

సాయం చేసి.. ప్రాణం కాపాడరూ

చికిత్స పొందుతున్న మంజుల

గంగాధర, ఫిబ్రవరి 7: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన కనపర్తి రూప(మంజుల) 10 రోజుల క్రితం వెదిర- హిమ్మత్‌నగర్ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తున్నారు. చికిత్స కోసం రోజుకు రూ.50 వేల వరకు ఖర్చు అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబం కావడంతో ఖర్చులు భరించలేకపోతున్నామని, దాతలు ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. మంజుల సోదరుడు కట్ట రమేశ్ ఫోన్‌పే నం.99480 24237కు ఆర్థిక సాయం పంపి ఆదుకోవాలని కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు 90 రోజులపాటు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు అకాడమీ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పీ అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ప్లంబింగ్ అండ్ శానిటేషన్ తదితర కోర్సులు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్ లేదా ఐటీఐ కోర్స్ చేసినవారు ల్యాండ్ సర్వే శిక్షణకు అర్హులని, మిగతా రెండు కోర్సుల కోసం పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి హుజూరాబాద్ కేసీ క్యాంపులో గల పాత డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ట్రైనింగ్ సెంటర్లో శిక్షణ ఇప్పిస్తామని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్టు అశోక్ కుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9848827124 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పరిహారం చెల్లించాలని వినతి

గంగాధర, ఫిబ్రవరి 7 : కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలని మండలంలోని రంగారావుపల్లికి చెందిన నిర్వాసితులు శుక్రవారం తహసీల్దార్ అనుపమను కలిసి వినతిపత్రం అందజేశారు. రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయి పరిహారం అందక ఇబ్బంది పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇక్కడ గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 7: రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు కరీంనగర్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆవాల నరహరి, జంకె రాంచంద్రారెడ్డి, తూముల తిరుపతి, వేల్పుల బాలయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాక ముందు అన్ని రంగాలతోపాటు విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తామని, విద్యకు బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించిందని తెలిపారు. ఈ మేరకు రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంలో భారత్ జోడో యాత్ర సందర్భంగా సైతం ప్రకటించారని పేర్కొన్నారు. కానీ, అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ విద్యారంగానికి బడ్జెట్లో 7 శాతం నిధులు మాత్రమే కేటాయించిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

డెయిరీ సిబ్బందికి వైద్య పరీక్షలు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 7: హుజూరాబాద్‌లోని నాగార్జున డెయిరీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు డెయిరీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డెయిరీలోని అన్ని విభాగాల సిబ్బందికి ప్రభుత్వ దవాఖాన డాక్టర్ ప్రసాద్ రావు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డెయిరీ డైరెక్టర్ పుల్లూరి గణేశ్ రావు మాట్లాడుతూ, సిబ్బంది ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి సంవత్సరంలాగే వైద్య పరీక్షలు చేయించామన్నారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ గణేశ్ రావు సతీమణి శృతి, ఏజీఎం ఆకునూరి సుధాకర్, ప్లాంట్ మేనేజర్ మాటూరు శ్రీనివాస్, మెయింటెనెన్స్ మేనేజర్ సంతోష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది